సాక్షి విశాఖపట్నం

ఆదివారం ၊ 1 ၊ డిసెంబర్ ၊ 2024

అనంతుని లోగిలి దీపకాంతుల సిరి



అనంతుని మెట్లపై దీపాల వెలుగులు







దీపోత్సవానికి తరలివచ్చిన భక్తులు



గిరి పరిసరాలు.. చిమ్మచీకట్లో వెలుగు దివ్వెల కాంతికి నూతన శోభను సంతరించుకున్నాయి. దేవ దేవుడైన అనంత పద్మనాభ స్వామి నామస్మరణతో మార్మోగాయి. పోటెత్తిన జనంతో పద్మనాభుని గిరి భక్త జనసాగరంగా మారింది. వేల దీప కాంతులు ఆధ్యాత్మిక సుగంధాలను వెదజల్లగా భక్తులు పులకాంకితుల య్యారు. ఇదీ పద్మనాభంలో శనివారం సాయంత్రం నిర్వహించిన అనంత పద్మనాభుని దీపోత్సవ వైభవం.



సిరుల తల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన మహిమాన్విత అమ్మవారు శ్రీ కనకమహాలక్ష్మి. మార్గశిర మాసంలో అమ్మవారికి పూజలు చేస్తే పుణ్యఫలాలు దక్కుతాయని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో వచ్చే గురువారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి తరిస్తారు. అమ్మ సన్నిధిలో ఏటా వైభవంగా నిర్వహించే మార్గశిర మాసోత్సవాలకు దేవస్థానం సిద్ధమైంది. ఈ నెల 2 నుంచి 30 వరకు వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ, అధికార వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ నెల 5, 12, 19, 26 తేదీల్లో వచ్చే గురువారాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలకు తరలివచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అమ్మవారి మాలధారణ స్వీకరించే భక్తుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతుండటంతో.. దేవస్థానం అదనపు ఏర్పాట్లు చేసింది. - మహారాణిపేట/డాబాగార్డెన్స్



మార్గశిరం.. సిరులతల్లి వైభవం

రేపటి నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

బురుజుపేటలో పండగ వాతావరణం



ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, చిత్రంలో ఈవో శోభారాణి, ఈఈ సీహెచ్‌వీ రమణ

ఉత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ఉత్సవాల నిర్వహణకు అన్ని శాఖల సహాయం తీసుకుని తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. సుమారు 600 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, 80 మంది దేవస్థానం సిబ్బందితో పాటు పర్వదినాల్లో 300 మంది వలంటీర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం జీవీఎంసీ సాయంతో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేవస్థానం లోపల, బయట, క్యూల్లో ఐదు చోట్ల తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా 65 డస్ట్ బిన్లను ఏర్పాటు చేస్తున్నామని, 30 మంది అదనపు కార్మికులు అందుబాటులో ఉంటారన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 60 రూట్ బస్సులతో పాటు 10 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అవసరమైన అన్ని చోట్లా వీధి దీపాలు, సీసీ కెమెరాలు అమర్చామన్నారు. ఈ నెల 26న జగన్నాథ స్వామి ఆలయ పరిధిలో మహా అన్నసమారాధన జరుగుతుందన్నారు. సమావేశంలో ఈఈ సీహెచ్‌వీ రమణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పార్కింగ్ సౌకర్యంపై ప్రత్యేక దృష్టి

దర్శనాలకు వచ్చే భక్తులు, దేవస్థానం సమీప ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. వీఐపీల వాహనాలకు ఆలయం సమీపంలోని ఘోషా ఆస్పత్రిలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ట్రాఫిక్ ఏడీసీపీ తెలిపారు. వీఐపీలు టౌన్‌కొత్త రోడ్డు నుంచి బురుజుపేట, పంజా జంక్షన్ మీదుగా ఘోషాస్పత్రికి చేరుకోవాలన్నారు. పూర్ణామార్కెట్, సన్నపువీధి, బీఎస్‌ఎన్‌ఎల్ మీదుగా వచ్చే సాధారణ భక్తుల వాహనాలకు మున్సిపల్ స్టేడియంలో, కాన్వెంట్ జంక్షన్, సీహార్స్ ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాలకు టౌన్ హాలులో, బీచ్‌రోడ్డు నుంచి వచ్చే వారికి ఎంవీడీఎం పాఠశాల వద్ద పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. అదనంగా వన్‌టౌన్ పరిధిలోని మెయిన్ రోడ్డుపై కూడా వాహనాలు నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏవీఎస్ కాలేజీ నుంచి, టౌన్ కొత్త రోడ్డు నుంచి ట్రాఫిక్ మళ్లిస్తామని చెప్పారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల రెండో తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో శనివారం దేవస్థానం మీటింగ్ హాలులో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వివిధ అంశాలపై ఆరా తీసిన కలెక్టర్.. ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లు, ఇంకా చేయాల్సిన పనులపై సమీక్షించారు. సాధారణ రోజుల్లో సుమారు ఐదు వేల మంది భక్తులు, గురువారాల్లో 10 వేల మంది వరకు భక్తులు రానున్న నేపథ్యంలో వారికి తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీలు, సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం, అసంతృప్తి కలగకుండా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. వేర్వేరు క్యూల ద్వారా భక్తులను లోపలకు పంపించాలని, ఎక్కడికక్కడ సమాచారం తెలుపుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రవేశ ద్వారం నుంచి మాత్రమే భక్తులు లోపలకు రావాలని, ఎగ్జిట్ మార్గం ద్వారా ఎవ్వరినీ లోపలకు అనుమతించవద్దన్నారు. అన్నదానం, ప్రసాద వితరణ, తాగునీరు పంపిణీ కేంద్రాల వద్ద తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ముసురులో నగరం

- ఫెంగల్ ప్రభావంతో వర్షాలు
- శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న జల్లులు
- రేపు మధ్యాహ్నం వరకూ కొనసాగే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావం.. విశాఖపట్నంపై కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి తేలికపాటి వర్షం నిరంతరంగా కురుస్తూనే ఉంది. ఎడతెరిపి లేకుండా వాన పడుతుండటంతో ముసురు వాతావరణం ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి. సాధారణం కంటే ఒక మీటరు ఎక్కువ ఎత్తులో అలలు ఎగసి పడుతున్నాయి. డిసెంబర్ 2 వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లొద్దనీ.. సందర్శకులు సముద్రంలో దిగేందుకు ప్రయత్నించొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అసలే చలికాలం.. ఆపై వర్షాలు.. తుఫాన్ గాలులతో నగరమంతటా చలితో వణికిపోతోంది.

శనివారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు కురిసిన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (మి.మీలలో)	ప్రాంతం	వర్షపాతం (మి.మీలలో)
రుషికొండ	28.5	మారికవలస	20.0
ఎండాడ	26.5	సీతమ్మధార	18.5
ఆరిలోవ	26.0	గంభీరం	16.5
సాగర్‌నగర్	25.0	కంబాలకొండ	15.75
కాపులుప్పాడ	24.5	పెదవాల్తేరు	15.5
మధురవాడ	24.25	ఆశీలుమెట్ట	15.0
హనుమంతవాక	23.25	భీమిలి	15.0
		హెచ్‌బీకాలనీ	14.75
		పెందుర్తి	13.5



చెన్నై, తిరుపతికి విమానాల రద్దు

ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో పలు విమానాల రాకపోకలను విశాఖపట్నం నుంచి రద్దు చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ప్రకటించాయి. ముఖ్యంగా భారీ వర్షాలు కురుస్తున్న తిరుపతి, చెన్నైకి విమాన సర్వీసులను శనివారం రద్దు చేసినట్లు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. అదేవిధంగా ఈదురుగాలుల కారణంగా వైజాగ్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన సర్వీసును నాగపూర్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ

కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ లీగల్: రెవెన్యూ, భూ నష్ట పరిహార కేసులు, ప్రభుత్వానికి చెందిన ఇతర సివిల్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. నూతన న్యాయస్థానాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో భూ తగదాలు, సివిల్ కేసులు ఎక్కువగా పరిష్కరించాలన్నారు. సాధ్యమైనంత ఎక్కువ కేసులు పరిష్కరించాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ అదాలత్ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ చలనాల డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పెద్ద సంఖ్యలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ మున్సిపల్ ట్యాక్స్‌కు సంబంధించిన కేసులు రాజీ చేస్తామన్నారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, అదనపు జిల్లా న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికారి కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, సివిల్ న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్లు, ప్రత్యేక మేజిస్ట్రేట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

- మహమ్మారి తగ్గుముఖం

అవగాహనే శ్రీరామరక్ష



- క్రమంగా తగ్గుతున్న ఎయిడ్స్ కేసులు
- ప్రస్తుతం జిల్లాలో 9,854 మంది రోగులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం



రెడ్ రిబ్బన్ ఆకారంలో ఎన్‌ఆర్‌ఐ వైద్య విద్యార్థులు

మహారాణిపేట: జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఎయిడ్స్‌పై అవగాహనతో పాటు అప్రమత్తత పెరగడం, సామాజిక చైతన్యం ఇందుకు కారణం. రోగాన్ని అదుపులో ఉంచే మందులు అందుబాటులో ఉండటంతో రోగుల జీవితకాలం పెరుగుతోంది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం ఏటా డిసెంబర్ ఒకటిన నిర్వహిస్తున్నారు. 'హక్కుల మార్గాన్ని అనుసరించండి– నా ఆరోగ్యం, నా హక్కు' అనే నినాదంతో ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచడం, ఎయిడ్స్‌తో మరణించిన వారిని స్మరించుకోవడం, హెచ్‌ఐవీకి వ్యతిరేకంగా పోరాడటం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. 2019 సర్వే ప్రకారం హెచ్‌ఐవీ కేసుల నమోదులో ఉమ్మడి విశాఖ ఆరో స్థానంలో ఉంది. ప్రస్తుతం విశాఖ జిల్లాలో 9,854 మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారని జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు. జిల్లాలోని 78 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో హెచ్‌ఐవీ పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పరీక్షలకు కావాల్సిన అన్ని కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

- విశాఖ జిల్లా ఆనందపురం మండలంలో 225 మంది, భీమిలిలో 374, గాజువాకలో 1,926, పద్మనాభంలో 85, పెదగంట్యాడలో 379, పెందుర్తిలో 758, విశాఖ రూరల్‌లో 806, విశాఖ అర్బన్‌లో 5,301 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు.
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 3,772 మంది పింఛన్లు పొందుతున్నారు. ఇందులో విశాఖ జిల్లాలో 1,742 మంది, అనకాపల్లిలో 1947, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 83 మంది ఉన్నారు. క్రమపద్ధతిలో మందులు వాడుతున్న వారికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోంది.
- విశాఖలో నివసిస్తున్న ఇతర జిల్లాల వారితో కలిపి 10,993 మంది యాంటీ రిట్రో వైరల్ మందులు(ఏఆర్‌టీ) వాడుతున్నారు. వీరిలో పెద్దలు 10,561, పిల్లలు 370, ట్రాన్స్‌జెండర్లు 62 మంది ఉన్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి తెలిపారు. ఏఆర్‌టీ మందులు వాడే వారిలో 96 శాతం మందికి హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేయించినట్లు చెప్పారు.



ఎయిడ్స్ అంతం.. మన లక్ష్యం

"ఎయిడ్స్ సోకిన వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలి. వారిని హేళన చేయవద్దు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి మనోధైర్యం అందించాలి. ఎయిడ్స్ పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 2030 నాటికి ఎయిడ్స్‌ను అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి."

– డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణ అధికారి

నేడు వైజాగ్ మారథాన్

విశాఖ స్పోర్ట్స్ : వైజాగ్ మారథాన్ మూడో ఎడిషన్ ఆదివారం సాగర తీరంలో జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు విభాగాల్లో పరుగు నిర్వహించనున్నారు. ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు సరదా రన్‌గా మూడు కిలోమీటర్ల పరుగును ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్నారు. ఇక మిగిలిన మూడు విభాగాల్లో విజేతలకు ఐదు లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సన్నాహకంగా ఈ వైజాగ్ మారథాన్‌ను పోలీస్, జీవీఎంసీ సహకారంతో నిర్వహించనున్నారు. సాగర తీరంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ఉదయం 5 గంటలకు హాఫ్ మారథాన్, 5.30 గంటలకు 10 కిలోమీటర్ల పరుగు, 6.15 గంటలకు 5 కిలోమీటర్ల పరుగు ప్రారంభం కానుంది.

సివిల్ జడ్జిలుగా ఏయూ లా కాలేజీ పూర్వ విద్యార్థినులు



గీతా భార్గవి



నైమిశ

విశాఖ విద్య: ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కళాశాల 2018–2021 బ్యాచ్ విద్యార్థిని వింజెల గీత భార్గవి, 2016–19 బ్యాచ్ విద్యార్థిని కేంబూరి నైమిశలు సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. ఇటీవల వెలువడిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో సత్తా చాటి చిన్న వయసులో సివిల్ జడ్జిలు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సీతామాణిక్యం హర్షం వ్యక్తం చేశారు. ఇద్దరు విద్యార్థినులు కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ఏఎంసీలో ఉద్యోగాలకు మెరిట్ జాబితా విడుదల

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో పలు పోస్టులకు సంబంధించి తుది మెరిట్ జాబితా విడుదల చేశారు. మొత్తం 10 కాంట్రాక్టు, 71 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం మెరిట్ జాబితాను www.visakhapatnam.ap.gov.in, www.amc.edu.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 10 రోజుల్లోగా తెలియజేయాలని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు.

కొరియర్ ద్వారా గంజాయి రవాణా

తాటిచెట్లపాలెం: ప్రముఖ కొరియర్ సంస్థ ద్వారా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును విశాఖపట్నం రైల్వే పోలీసులు రట్టు చేశారు. వివరాలివీ.. వికాష్‌కుమార్ అనే వ్యక్తి విశాఖ నుంచి ఢిల్లీకి 16 కిలోల గంజాయిని రవాణా చేస్తుండగా రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతన్ని విచారించగా పలు ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. వికాష్‌కుమార్ ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని ప్యాక్ చేసి, ఆన్‌లైన్‌లో హోం సర్వీస్ పికప్ బుక్ చేస్తున్నాడు. కొరియర్ సంస్థలు ప్యాకింగ్‌లో ఏముందని అడిగితే.. డ్రైఫ్రూట్స్ అని చెబుతుండటంతో వారు బుక్ చేస్తున్నారు. ఇలా విశాఖ నుంచి పలు ప్రాంతాలకు గంజాయి రవాణా చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీని వెనుక ముఠా ఉన్నట్లు తెలుసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించారు. అలాగే రైల్వేస్టేషన్‌లో శనివారం చేపట్టిన తనిఖీల్లో మరో ఇద్దరిని జీఆర్పీ సిబ్బంది అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన మహ్మద్ నాదిర్‌షా వద్ద 8 కిలోలు, బిహార్‌కు చెందిన నితీష్‌కుమార్ వద్ద 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడి అరెస్ట్

- జాయ్ జమీమా వెనుక ఉన్నది వేణుభాస్కరరెడ్డి
- వారి మధ్య భారీగా నగదు లావాదేవీలు

విశాఖ సిటీ: హనీ ట్రాప్ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ధనికులు, వ్యాపారవేత్తలు, వివాహమైన వారికి వల వేసి ప్రేమాయణం నడిపి బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షలు కాజేసిన జాయ్ జమీమా వెనుక ఉన్న ప్రధాన ముఠా సభ్యుడు వేణుభాస్కర్‌రెడ్డిని ఎయిర్‌పోర్ట్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. జాయ్ జమీమాతో సహజీవనం చేసే శ్రీకాకుళం జిల్లాకు చెందిన వేణుభాస్కర్‌రెడ్డి వెనుకుండి బాధితులపై దాడులు, హత్యాయత్నం చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు విచారణలో నిర్ధారణైంది. వివరాల్లోకి వెళితే.. జాయ్ జమీమా అనే మహిళ నగరంలో పలువురు బడాబాబులకు వలపు వల విసిరి, వారితో సన్నిహితంగా ఉన్న ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షలు కాజేసింది. డబ్బు కోసం కొంత మందిపై దాడులు, హత్యాయత్నాలు కూడా చేసింది. ఆమె ట్రాప్‌లో చిక్కిన ఒక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సినిమా తరహాలో మత్తు మందు ఇచ్చి బాధితులను లొంగదీసుకొని వీడియోలు తీసి బెదిరింపులకు దిగిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఆమె అరెస్టు తరువాత వరుసగా బాధితులు బయటకు వచ్చి నగరంలో పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.

కీలక సూత్రధారి కోసం ప్రత్యేక బృందాలు

పోలీసుల విచారణకు జాయ్ జమీమా కనీసం సహకరించకపోగా తిరిగి వారిపైనే బెదిరింపులకు దిగింది. ఒక మహిళ ఇంత మందిని మోసం చేయడం, దాడులు చేయడం వెనుక ఉన్న వారి కోసం పోలీసులు నిఘా పెట్టారు. కొంతమంది బాధితులపై దాడులు చేసిన క్రమంలో ఆమెతో పాటు ఆమె స్నేహితుడు కూడా ఉన్నట్లు పలువురు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిచ్చిన సమాచారంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఆమె కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీలు, ఇతర సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టారు. ఇందులో లభించిన సమాచారంతో పోలీసులు ఆమె స్నేహితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఈ కేసు రాజకీయ, సామాజికవర్గ రంగు పులుముకుంది. మాజీ మంత్రి హర్షకుమార్ నేరుగా విశాఖకు వచ్చి జాయ్ జమీమా కేసులో పోలీసులపై ఆరోపణలు సైతం చేశారు. దీంతో పోలీసులు ఈ కేసులో మరింత స్పీడ్ పెంచారు.

పలు కేసుల్లో నిందితుడు

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు జాయ్ జమీమా వెనుక ఉన్నది శ్రీకాకుళం జిల్లాకు చెందిన వేణుభాస్కర్‌రెడ్డి అని గుర్తించారు. జమీమా, వేణుభాస్కర్‌ల మధ్య జరిగిన నగదు లావాదేవీల సాక్ష్యాలను సైతం సేకరించారు. మద్దిలపాలెం ప్రాంతంలో ఉండే ఒక వ్యక్తిని కూడా మత్తులోకి దించి, బెదిరించి హత్యాయత్నం చేసి భారీగా మొత్తంలో నగదు కాజేసినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. వేణుభాస్కర్‌రెడ్డి కూడా పలు కేసుల్లో నిందితుడిగా ఉంటూ తప్పించుకొని తిరుగుతున్న ట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందాలతో గాలించిన పోలీసులకు వేణుభాస్కర్‌రెడ్డి ఎన్ఏడీ కొత్త రోడ్ వద్దే పట్టుబడ్డాడు. దీంతో శనివారం అతడిని అరెస్టు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టనున్నారు.

అనంతుని లోగిలి.. దీపకాంతుల సిరి

పద్మనాభం: రాష్ట్రంలో విశిష్టతను సంతరించుకున్న అనంత పద్మనాభుని దీపోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. తైల దీపాలు వెదజల్లిన సింధూర వర్ణపు కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్యమానంగా వెలుగొందింది. అనంతుని దీపోత్సవ దీప్తి దశ దిశలా వ్యాపించి భక్తులకు ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కల్పించింది. గిరి శిఖరంపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటల నుంచే భక్తుల రావడం ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పద్మనాభం రోడ్లన్నీ భక్త జన సందోహంతో నిండిపోయాయి. తుపాన్ ప్రభావం వల్ల వర్షం కురిసినా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన భక్తులు అనంతుని పాద సన్నిధిలో దీపారాధన చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంత పద్మనాభస్వామి చిన్న ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరుల నాద స్వరాల నడుమ తొలి పావంచా వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి పావంచా వద్ద కొలువు దీరిన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు జేగంట మోగగానే భక్తులు 1,200 మెట్లు కిరువైపులా తైల దీపాలు వెలిగించారు. తైల దీపాలంకరణతో అనంత పద్మనాభుని గిరికి సిందూర తోరణాలు అద్దినట్టు సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన చిడతలు, తప్పెటిగుళ్లు, పులివేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

జైలు అధికారుల బదిలీ



కిశోర్ కుమార్ వెంకటేశ్వరరావు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఏపీ జైళ్ల శాఖ డీజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌కు అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్‌గా అటాచ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు కేంద్ర కారాగారం అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబును ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా ఇక్కడ నియమించారు. ఇక్కడ అడిషనల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకటేశ్వరరావును నెల్లూరు కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు. అలాగే ఆఫీస్ సూపరింటెండెంట్(పరిపాలన విభాగం) డి.శరత్‌బాబును నెల్లూరు కారాగారం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా అటాచ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు ఆఫీస్ సూపరింటెండెంట్ వి.అప్పారావును ఇక్కడ నియమించారు. నెల్లూరు కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ ఎన్.సాయి ప్రవీణ్‌ను విశాఖకు బదిలీ చేశారు. వీరంతా ఎవరి స్థానంలో వారు త్వరగా బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఇటీవల జరిగిన పరిణామాలు ఈ బదిలీలకు కారణంగా పలువురు భావిస్తున్నా రు. గంజాయితో జైలు ఫార్మాసిస్ట్ పట్టుబడటం, రిమాండ్ ఖైదీ జైలు గేటు వద్ద హల్‌చల్ చేయడం, బీడీ కట్టలతో మరో రిమాండ్ ఖైదీ పట్టుబడ టం తదితర వ్యవహారాలు ఇటీవల చోటు చేసుకున్నా యి. ఈ నేపథ్యంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈ జైలుపై ప్రత్యేక దృష్టి పెట్టి.. బదిలీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

94.74 శాతం పింఛన్ల పంపిణీ



పెదజాలారిపేట సచివాలయం వద్ద వేచి చూస్తున్న లబ్ధిదారులు

మహారాణిపేట: జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 94.74 శాతం పూర్తయింది. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 1,61,584 పింఛన్‌దారులు ఉండగా.. వారి కోసం ప్రభుత్వం రూ.69 కోట్లు విడుదల చేసింది. శనివారం రాత్రి 7 గంటల సమయానికి 1,53,088 మందికి గానూ రూ.65 కోట్లు అందజేశారు. పెదజాలరిపేట సచివాయం వద్దకు లబ్ధిదారులను చేర్చి పింఛన్లు అందజేశారు. ఇదే పరిస్థితి చాలా చోట్ల కనిపించింది. మిగిలిన వారికి సోమవారం పింఛన్లు అందజేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

గంజాయితో ఐదుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

అల్లిపురం: చెన్నైకి గంజాయి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్న ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20.028 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి ఈ కేసు వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తొండియార్‌పేట్, పూండితనగమ్మల్ స్ట్రీట్‌కు చెందిన షకీలా గుణ, పాలిని రాజేష్, నజీర్ భాషా, జబునిషాలు అల్లూరి సీతా రామరాజు జిల్లా దిగురపల్లి మండలం బొంతిలికి చెందిన లాసంగి మల్లన్నను కలిశారు. అతని వద్ద నుంచి కిలో గంజాయి రూ.2,500 చొప్పున 20 కిలోల గంజాయిని రూ.50 వేలకు కొనుగోలు చేసేందుకు బేరం కుదుర్చుకున్నారు. రూ.30 వేలు అడ్వాన్స్ చెల్లించారు. మిగిలిన రూ.20 వేలు తర్వాత చెప్పి.. 10 కేజీల గంజాయి తీసుకుని విశాఖ చేరుకున్నారు. మిగిలిన 10 కిలోల గంజాయి తీసుకుని లాసంగి మల్లన్న శుక్రవారం విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. షకీలా గుణకు గంజాయిని అప్పగిస్తుండగా..టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు సమాచారం అందుకుని దాడి చేశారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని వివరాలు సేకరించారు. మొత్తం ఐదుగురిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. సమావేశంలో టూటౌన్ సీఐ బి.తిరుమలరావు పాల్గొన్నారు.

ఐఐఎంవీ ఉత్తమ విద్యార్థికి రామచంద్రమ్మ అవార్డు



ఐఐఎంవీ అధికారికి చెక్కు అందిస్తున్న రామచంద్రమ్మ కుటుంబ సభ్యుడు

తగరపువలస: ప్రముఖ విద్యావేత్త మోటపర్తి రామచంద్రమ్మ జయంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు ఐఐఎంవీ ఎంబీఏ విభాగంలో ఉత్తమ విద్యార్థి అవార్డును నెలకొల్పారు. ఇందుకోసం రూ.5.25 లక్షలను నిధిగా సంస్థకు విరాళంగా అందించారు. ఎంబీఏ ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రోత్సాహకంగా రామచంద్రమ్మ పేరిట మెరిట్ సర్టిఫికెట్, నిధిపై వచ్చే ఆదాయాన్ని వార్షిక నగదు బహుమతిగా ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఐఐఎంవీ అధికారులతో రామచంద్రమ్మ కుటుంబ సభ్యులు శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

సంక్రాంతికి సరికొత్త వస్త్రాల సూత్ర ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభిస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్: సంప్రదాయం, ఫ్యాషన్‌ల మేళవింపుగా విశాఖవాసులను అలరించే సూత్ర ప్రత్యేక ప్రదర్శన శనివారం నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. నగరంలో విభిన్న రంగాలలో తమదైన శైలిలో రాణిస్తున్న మహిళలు లక్ష్మీ నతి, సునీత దుతర్, ప్రమీల, రాధిక, సుధలు ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి తీసుకువచ్చిన వైవిధ్యమైన డిజైన్లతో వస్త్రాలు సంక్రాంతికి కొత్త కాంతులను నింపనున్నాయి. ఇంటి అలంకరణకు ఉపయోగించే వస్తువులు, బహుమతులుగా ఇవ్వడానికి ఉపకరించే వస్తువులు సైతం ఇక్కడ ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. సూత్ర ఎగ్జిబిషన్‌లో పండగ షాపింగ్ అనుభూతిని పొందే విధంగా గృహోపకరణ వస్తువులు, హస్తకళా చీరలు, లెహంగాలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, సొగసైన ఆభరణాలు వంటివి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి 40కిపైగా ఎగ్జిబిటర్లు తమ ప్రత్యేక కలెక్షన్‌ను ఇక్కడ నగరవాసులకు అందుబాటులో ఉంచారు. వెర్వ్ విస్టా, గాల్స్ గ్యాలరీ, హ్యాండ్ లూం హౌస్, అవమా జ్యువెలర్స్(కోల్‌కతా), ఢిల్లీ హాట్, వి.స్టూడియో, ఆభూషన్ వన్, కృతి బోటిక్, స్వీజా జ్యువెలరీ, ది జిగ్స్ కలెక్షన్స్, తారా జ్యువెలరీ వంటి ప్రముఖ సంస్థలు స్టాల్స్‌లో తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాయన్నారు.

5వ అంతస్తు నుంచి జారి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి



వరప్రసాద్ (ఫైల్)

బీచ్‌రోడ్డు: భవన నిర్మాణ పనులు చేస్తున్న ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు 5వ అంతస్తు నుంచి జారి కింద పడిపోయారు. వారిలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం వీఐపీ రోడ్డులోని నిర్మిస్తున్న ఒక భవనంలో పనిచేసేందుకు మేస్త్రీ శివశంకర్ వరప్రసాద్ (33), సహాయకుడుగా త్రినాథ్ (42) శనివారం వచ్చారు. 5వ అంతస్తు పరంజాపై పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఇద్దరు కిందపడిపోయారు. ప్రమాదంలో వరప్రసాద్ మరణించగా, తీవ్ర గాయాలపాలైన త్రినాథ్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వరప్రసాద్ భార్య ఇద్దరి పిల్లలతో సీతమ్మధారలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఉదయం పూట మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వరప్రసాద్ మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిపోయింది.

